క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనసేవ తదితర పూజల అనంతరం పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించి మహామంగళ హారతులు, ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వాతి పల్లకీ సేవ సమితి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రాయలు, రామాంజనేయశర్మ పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం



రుద్రవరంలోని శివాలయం సమీపంలో క్షుద్ర పూజలు చేసిన దృశ్యం

రుద్రవరం: మండలంలో కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో గుట్టుగా క్షుద్రపూజలు చేస్తున్నారు. ఉదయం అటుగా వెళ్లిన వారు వాటిని చూసి భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే ముత్తలూరు,రెడ్డిపల్లె గ్రామ సమీపాల్లో జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో క్షుద్ర పూజలు చేశారు. తాజాగా గురువారం స్థానిక భాస్కర నందీశ్వర స్వామి ఆలయకి సమీపంలోనున్న అరుణోదయ పాఠశాల వెనుక భాగంలో లింగమయ్యగౌడ్ ఇంటికి ఎదురుగా క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. వాటిని చూసి విద్యార్థులు, కాలనీ వాసులు, శివాలయానికి వెళ్లే భక్తులు భయాందోళన చెందారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): బొమ్మలసత్రంలోని షిర్డిసాయిబాబా మందిరంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత వెంకటరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. శ్రీసాయికమిటీ సభ్యులు మాట్లాడుతూ రూ.3లక్షల విలువజేసే వాటర్ ప్లాంట్‌ను హర్షగిరి వంశీకృష్ణారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి సహకారంతో భక్తుల కోసం ఏర్పాటు చేశారన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ లలితమ్మ, గంగాచరణ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి ఉన్నారు.

రెగ్యులర్ చేయండి

శిరివెళ్ల: తాము ఎన్నో ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నామని తమను రెగ్యులర్ చేయాలని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాంట్రాక్ట్ లెక్చరర్లు బాలకోటయ్య, విజయరేఖ,గాయత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. బస్సుయాత్రలో భాగంగా గురువారం యర్రగుంట్లలో ముఖాముఖి కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అనంతరం నంద్యాలకు వెళ్తున్న సందర్భంగా మధ్యలో తన కోసం ఎదురు చూస్తున్న యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులను చూసి సీఎం బస్సును ఆపారు. బస్సు దిగి వచ్చి వారితో మాట్లాడారు. తాము ఇరవై ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

గడ్డివాముల దగ్ధం



రూపనగుడిలో కాలిపోతున్న గడ్డివాములు

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడి గ్రామంలో రైతులు పెద్దకొండయ్య, చిన్నకొండయ్యకు చెందిన నాలుగు గడ్డి వాములు గురువారం అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని బాధిత రైతులు వాపోయారు. గడ్డివాముల సమీపంలో పంట నూర్పిడి అనంతరం కుప్పగా వేసుకున్న 30 ఎకరాల్లోని శనగ పొట్టు కూడా వాముల సమీపంలో ఉండటంతో కాలిబూడిదైంది. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొన్నారు. గ్రామస్తులు ఆళ్లగడ్డ ఫైరింజన్ అధికారులకు సమాచారం చేరవేయడంతో సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పక్కనున్న గడ్డివాములకు ప్రమాదం తప్పింది.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

గడివేముల: పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని నంద్యాల జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వర్ రావు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన గడివేములలో డెంగీ పాజిటివ్ కేసును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఫ్రైడేను డ్రై డేగా నిర్వహించాలన్నారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకులను, డ్రైనేజీలను పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వెంకటేష్ రెడ్డి, ఏఎన్‌ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.





నంద్యాల, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థులుగా శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డిని ప్రకటిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

అర్హులందరికీ పథకాలు అందజేశాం



రామనాథరెడ్డి నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: అర్హులైన ప్రతి కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా కులం,మతం చూడకుండా సంక్షేమ పథకాలు అందజేశామని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రామనాథరెడ్డినగర్‌లో తన సతీమణి, కౌన్సిలర్ శిల్పా నాగినిరెడ్డితో కలిసి రెండవ రోజు ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేలును వివరిస్తూ మళ్లీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి మళ్లీ జగనన్న పాలనను కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలంటే మీ ఆశీస్సులు కావాలన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మాటలు నమ్మే స్థితిల్లో ప్రజలు లేరన్నారు. జగనన్న హామీ ఇస్తే తప్పకుండా నెరవేర్చే వ్యక్తి అనేది ప్రజలందరికీ తెలుసునన్నారు.

అడవికి నిప్పు... పర్యావరణానికి ముప్పు

నల్లమల అడవిలో మంటలను అదుపు చేస్తున్న ఫారెస్టు సిబ్బంది



- 5.40 లక్షల హెక్టార్లలో నల్లమల అటవీక్షేత్రం
- పచ్చదనానికి నిప్పు పెడుతున్న ఆకతాయిలు
- కాలిపోతున్న విలువైన చెట్లు
- అగ్ని ప్రమాదాల నివారణకు 120 మంది ఫైర్ వాచర్లతో ప్రత్యేక చర్యలు

నంద్యాల(సిటీ): జిల్లాలో నల్లమల అడవికి ఎంతో ప్రాధాన్యత ఉంది. సకాలంలో వర్షాలు కురవడం, ముఖ్యమైన జలాశయాలన్నీ అటవీ పరిధిలోనే ఉండటంతో పాటు వన్యప్రాణులకు ఆవాసంగా విరాజిల్లుతుంది. అయితే కొందరు ఆకతాయిలు అడవికి నిప్పు పెడుతుండటంతో వన్యప్రాణులతో పాటు మహా, విలువైన వృక్షాలు కాలిబూడిదవుతున్నాయి. అడవిని రక్షించేందుకు, మంటలను ఆర్పేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అడవికి నిప్పు పెట్టకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అంతే కాకుండా కొన్ని ప్రాంతాల్లో నిప్పు కారకాలను అనుమతించడం లేదు. నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ పరిధిలో నల్లమల 12.5లక్షల ఎకరాల్లో దట్టంగా విస్తరించింది. ఎన్నో రకాల వృక్ష జాతులకు, వన్యప్రాణులకు నిలయంగా మారి జీవవైవిధ్యంలో మార్పులకు కారణంగా మారింది.

ముందుస్తు జాగ్రత్తలు..

ఎక్కడా అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా క్షేత్రాలను దర్శించుకునే భక్తులు, ప్రయాణికులకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తూ సూచికలు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లోకి ఎవరినీ అనుమతించడం లేదు. ఇందుకు గస్తీ నిర్వహిస్తూ నిరంతరం అడవిని రక్షిస్తున్నారు. కొందరి స్వార్థానికి అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో అటవీ సంపద బూడిదవడంతో పాటు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. వన్యప్రాణులకు గ్రాసం కొరత కూడా ఏర్పడుతోంది. తద్వారా జంతువులు నీరు, ఆహారం కోసం సమీప గ్రామాలను ఆశ్రయిస్తున్నాయి.

120 మంది సిబ్బందితో గస్తీ..

అగ్ని ప్రమాదాలను నియంత్రించేందుకు అటవీశాఖ అధికారులు 120 మంది ఫైర్ వాచర్లతో నిత్యం గస్తీ చేపడుతున్నారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు 50 బ్లోయర్లు, 50కి పైగా స్ప్రేయర్లు అందుబాటులో ఉంచారు. 40కి పైగా వాహనాల సహకారంతో మంటలను అదుపు చేయనున్నారు. నిరంతరం గస్తీ చేపడుతూ నిప్పుకు కారణాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడదాం



నల్లమల ఎన్నోరకాల వృక్ష, జంతు సంపదకు నిలయం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అడవులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అటవీక్షేత్రం బాగుంటేనే సమయానికి వర్షాలు కురుస్తాయి. జీవావరణంలో మార్పులకు కూడా అడవులు ఎంతో దోహదం చేస్తాయి. నల్లమల అడవుల్లోని నాణ్యమైన, సారవంతమైన నేల వర్షాభావ పరిస్థితులలో తరలిపోయి పరోక్షంగా 450 గ్రామాలకు పైగా లబ్ధి చేకూరుతుంది. వేలాది మంది పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. అందరికీ ఆధారమైన జీవవైవిధ్యమైన అడవులను నిప్పు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో మరింత నిఘా పెంచి అడవులను పరిరక్షిస్తాం. అడవులకు నిప్పు పెట్టకుండా 20కి పైగా వాచ్ టవర్లు ఏర్పాటు చేశాం. నిప్పుకు కారణమైన వస్తువులను అడవిలోకి తీసుకెళ్లరాదు. – బీఎస్ఎస్ మూర్తి, ఎస్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ

వైద్యులు కావడం పూర్వజన్మ సుకృతం

నంద్యాల టౌన్: వైద్య వృత్తిని ఎంచుకుని.. వైద్యులుగా ఎదిగి ఎంతోమంది అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సేవ చేయటం పూర్వజన్మ సుకృతమని నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.స్వర్ణలత పేర్కొన్నారు. గురువారం పదవీ విరమణ సందర్భంగా కళాశాలలో ఆచార్యులు, సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి వైద్యుడు మానవతా దృక్పథంతో రోగులకు సేవ చేయాలన్నారు. నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలకు మొదటి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నంద్యాల వైద్య కళాశాల కార్పొరేట్ వైద్య కళాశాలను మించి అభ్యున్నతి సాధించాలని ఇందుకు ఆచార్యులు, విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని కోరారు. నూతనంగా కళాశాల ఏర్పాటు చేసినా.. అన్ని సీట్లు భర్తీ కావటం సామాన్య విషయం కాదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద కుమార్, అడ్మిన్ మోహన్ కృష్ణ, డాక్టర్ బాలీశ్వరి, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ట మహోత్సవం

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామంలో రూ.కోటి నిధులతో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం శ్రీ అంబమల్లేశ్వరస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అర్చకులు వేదమంత్రాలను పఠిస్తూ మహన్యాస పారాయణ పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, యంత్రప్రతిష్ఠాపన, నేత్రోన్మలనం, కశ్యజ్వాల, కూస్మాండబలి, మాసబలి నిర్వహించారు. భక్తులు ఓం నమఃశివాయ అంటూ శివపంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ గర్భగుడిలో శ్రీఅంబమల్లేశ్వరస్వామి వారి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం పూర్ణాహుతి, కలశస్థాపన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి దంపతులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



గర్భగుడి ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణంకోసం దేవస్థానం గురువారం ఆలయప్రాంగణంలోని త్రిఫలవక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేష పూజలను నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

మహానందిలో పెళ్లిసందడి


మహానంది: మహానందిలో గురువారం పెళ్లిసందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన వధూవరులు మహానందీశ్వరస్వామి చెంత ఒక్కటయ్యారు. దేవస్థానంలో ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంతో పాటు ప్రైవేటు కల్యాణ మండపాల్లో పెళ్లిళ్లు జరిగాయి. నూతన వధూవరులతో పాటు బంధుమిత్రులు శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులరద్దీ నెలకొంది. భక్తులరద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.



పెళ్లి చేసుకునేందుకు గుడిలోకి వస్తున్న పెళ్లిజంట



21వ బ్లాక్ కాల్వలో పారుతున్న బ్యాక్ వాటర్



నీటితో కళకళలాడుతున్న గండ్లేరు జలాశయం

కల్పతరువు..'గండ్లేరు'

- వ్యవసాయం, తాగునీటి అవసరాలను తీరుస్తున్న జలాశయం
- ప్రస్తుతం ఈ నీటి ఆధారంగా వరి, మినుము పంటలు సాగు
- కోత దశలో పైర్లు
- రిజర్వాయర్‌తో సమృద్ధిగా భూగర్భ జలాలు



దొర్నిపాడు నరసింహస్వామి ఆలయ సమీపంలో కోత దశలో వరి పైరు

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న గండ్లేరు జలాశయం చుట్టు పక్కల గ్రామాల రైతులకు వరంగా మారింది. ఆ నీరు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల్లోని గ్రామాలకు తాగునీటి సరఫరాకు ఉపయోగ పడుతోంది. జలాశయంలో నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు అడుగంటకుండా దోహదపడుతోంది. తద్వారా బోరు మోటార్ల నుంచి నీరు సమృద్ధిగా వస్తుడటంతో రైతులు ఏడాదికి రెండు నుంచి మూడు పంటలు పండించుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి దాదాపు పది విడతలుగా వారబంధీ పద్ధతిలో నీటిని విడుదల చేసింది. ఆ నీటితో గండ్లేరు జలాశయం కళకళాడుతోంది. రిజర్వాయరులోని నీరు బ్యాక్ వాటర్ కింద తిరిగి వెనుక వైపునకు వస్తూ 21,22 బ్లాక్ తూముల ద్వారా ఉప ప్రధాన కాల్వల్లో పారుతోంది. గతంలో నీరు వెనక్కు రాకుండా ఉండేందుకు అధికారులు అడ్డుకట్ట నిర్మించారు.అయితే ఆ అడ్డుకట్టకు అడుగు భాగాన కొందరు రైతులు అక్రమంగా గండికొట్టారు. ఆ గండి ద్వారా రిజర్వాయర్ నుంచి నీరు దిగువకు పారుతోంది. ఆ నీటితో రుద్రవరం సమీపంలోనున్న దొర్నిపాడు నరసింహ స్వామి ప్రాంతం, హరినగరం టీ.లింగదిన్నె గ్రామాల రైతులు వందలాది ఎకరాల్లో వరి, మినుము వంటి పంటలు సాగు చేశారు. పంటలు దెబ్బతినకుండా బ్యాక్ వాటర్‌ను పంటలకు మళ్లించుకుంటున్నారు. ప్రస్తుతం పంటలు కోత దశలో ఉన్నాయి. ఇటు వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుండటంతో ఈ ప్రాంతవాసులకు కల్పతరువుగా మారింది. జగనన్న పాలనలో పంట తడులకు తాము ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, గతంలో ఎంతో కొంత ఖర్చయ్యేదని, ఉచితంగానే నీరందజేయడం సంతోషంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.

నేడు గుడ్‌ఫ్రైడే వేడుకలు

నంద్యాల(న్యూటౌన్): గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని శుక్రవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ఐ సెక్రటరీ ప్రభుదాసు, కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1, ఆల్ సెయింట్ చర్చ్ పాస్టరేట్-2, బాప్టిస్ట్ రక్షణాలయం, ఆరోగ్యమాత ఆలయం, మత్తయి ఆలయం, డానియేల్‌పురం, హోసన్న, సీయోను, ఏసుకృపలతో పాటు నంద్యాల బిషప్ బంగ్లాలో ఉన్న ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయంలో నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్, డాక్టర్ రైట్ రెవరెండ్ ఐజక్ వరప్రసాద్ సందేశం ఇస్తారని చెప్పారు.

ఓటు ఎంతో విలువైనది

నంద్యాల(అర్బన్): ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నంద్యాల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. గత ఎన్నికల్లో 50శాతం కంటే తక్కువగా పోలైన పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో పోలింగ్ బూత్‌లు 159, 160, 162 ప్రాంతాలకు చెందిన ఓటర్లకు ఓటు వినియోగంపై స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఓటు హక్కు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవచ్చని, తద్వారా ప్రజాస్వామ్య దేశాన్ని స్థాపించుకోవచ్చని పేర్కొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లెకు చెందిన లక్ష్మీనరసయ్య (34) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు..మృతుడు కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. వైద్యం చేయించినా నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై ఈ నెల 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అందించినా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య వరలక్ష్మి ఉంది.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

శ్రీశైలం: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ గుర్రప్ప, ఎస్ఐ లక్ష్మణరావుతో కలిసి వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. ర్యాలీలకు అనుమతి తప్పనిసరి అని, సోషల్ మీడియాలో అనవసర పోస్టులు పెట్టవద్దని, దేవదాయ చట్టాన్ని ఉల్లంఘించొద్దని సూచించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు: పట్టణంలో గురువారం ఆత్మకూరు సీఐ నాగభూషన్ యాదవ్ వాహనాల తనిఖీ చేపట్టారు. సంగమేశ్వరం సర్కిల్, నంద్యాల టర్నింగ్, ఫారెస్ట్ చెక్‌పోస్టులో ఈ తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల సందర్భంగా అక్రమ డబ్బు, అక్రమ మద్యం తరలించ రాదని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశించిన సూచనల మేరకు అన్ని పరిమితులకు లోబడి నడుచుకోవాలన్నారు. నగదు తీసుకొని వెళ్లే వ్యక్తులు తప్పనిసరిగా తగిన ఆధారాలను వెంట పెట్టుకోవాలన్నారు.

అడుగులన్నీ నంద్యాల వైపే



ఉయ్యాలవాడ నుంచి నంద్యాలకు బయలుదేరుతున్న నాయకులు, కార్యకర్తలు



దొర్నిపాడు నుంచి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ఉయ్యాలవాడ : ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్ర గురువారం జిల్లా కేంద్రమైన నంద్యాల చేరుకుంది. పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభకు మండలంలోని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, జేఏసీ కన్వీనర్ లాలమ్మ గారి హుసేనయ్య(బుజ్జి), సింగిల్‌విండో అధ్యక్షులు పల్లె మహేశ్వరరెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్ వెళ్లారు.

దొర్నిపాడు: ఎన్నికల శంఖారావంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్రకు మండలంలోని అన్ని సచివాలయ పరిధి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో నంద్యాలకు గురువారం తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు వెళ్లారు.

రుద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం అంటూ ఎన్నికల శంఖారావాన్ని పూరించి బస్సు యాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం నంద్యాలలో ఆయన నిర్వహించిన బహిరంగ సభకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్లారు.

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం జరిగిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ నంద్యాల విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జి సన్నల సాయి రాంరెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ విదేశీ విద్య దీవెన, జగనన్న విద్యాకానుక తదితర పథకాలను ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు.



టీ.లింగంగదిన్నె నుంచి నంద్యాలకు బయలుదేరిన నాయకులు,కార్యకర్తలు



ముఖ్యమంత్రి సభకు బయల్దేరిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

ఎన్నికల నిబంధనలు అందరూ తెలుసుకోవాలి

పాములపాడు: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీడీఓ సరస్వతి సచివాలయ సిబ్బందితో అన్నారు. ఎంసీసీలో భాగంగా బుధవారం మండలంలోని జూటూరు గ్రామంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంతకు మునుపు గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన పలు విషయాలపై సూచనలు ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ రామేశ్వర్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఆలయ నిర్మాణానికి హమాలీలు విరాళాన్ని అందించారు. గ్రామంలో శ్రీ షిరిడీ సాయిబాబా దేవస్థానాన్ని నూతనంగా గ్రామపెద్దల సహాయంతో నిర్మిస్తున్నారు. అందుకు హమాలీలు లింగస్వామి, పరమేష్, శ్రీనివాసులు, వెంకటరమణ, నరేంద్ర, వినోద్, శ్రీకాంతులు విరాళంగా రూ.10016 లను ఆలయ కమిటీ మెంబర్లు కె.బాలకృష్ణ, వెంకటస్వామి, చాకలి నారాయణలకు గురువారం అందించారు. అదేవిధంగా ఏవరైన దాతలు ఉంటే ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.

107 మంది పోలింగ్ సిబ్బంది నియామకం

జూపాడుబంగ్లా: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ నిమిత్తం 107 మందిని ప్రిసైడింగ్, అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులుగా ఎంపిక చేసినట్లు తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం మండల కోడ్ ఆఫ్ కండక్టు, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు మరికొంత మందిని ఎన్నికల విధుల నిర్వహణ నిమిత్తం ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి ఈనెల 30న నందికొట్కూరు పట్టణంలోని శాంతి సినిమా థియేటర్‌కు ఎదురుగా ఉన్న షాపుత్ ఫంక్షన్‌హాలులో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన ఉరుసు

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో ఖత్‌బె రబ్బాని హైకల్ నూరాని సయ్యద్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ స్వామి, శ్రీశ్రీ శ్రీ హజరత్ సయ్యద్ సుల్తాన్ షా ఖాద్రిషర్ఫి స్వాముల వారి ఉరుసు మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం 7 గంటలకు గురు సమాధి దర్శనం, సాయంత్రం 3 గంటలకు కిస్తీ వేడుకలు వైభవంగా నిర్వహించారు.